నగునూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సంజీవ్‌రావు, ఏఈవో ప్రణయ్

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే 27: వానకాలంలో పంటలు వేసే రైతులు విత్తనాల కొనుగోలులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సంజీవ్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని నగునూర్, చామనపల్లి, చెర్లభూత్కూర్, బొమ్మకల్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. నగునూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీడీవో పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ గుర్తింపు పొందిన షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అలాగే తప్పనిసరిగా రసీదు పొందాలని సూచించారు. ఆయన వెంట ఏఈవో ప్రణయ్ ఉన్నారు. అలాగే చామనపల్లిలో బీటీఎం శ్రీలత, ఏటీఎం రమ్య, బొమ్మకల్‌లో ఏఈవో పైడితల్లి, చెర్లభూత్కూర్‌లో కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, ఏఈవో స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, వాజీద్, కసూర్తి శ్రీనివాస్ రెడ్డి, ఆయా గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల దయతో పల్లెలు సుభిక్షం

మల్యాలలో బీరన్న బోనం ఎత్తుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు

ఇల్లందకుంట, మే 27: పల్లెల్లో గ్రామ దేవతలు, కులదేవతల పండుగలను సమష్టిగా జరుపుకోవడం అభినందనీయమని, వారి దయతో గ్రామాలు పాడి పంటలతో సుభిక్షం కావాలని కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని మల్యాల, లక్ష్మీజీపల్లి గ్రామాల్లో బీరన్న ఉత్సవాల్లో భాగంగా బోనాల పండుగకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వయంగా బోనం ఎత్తుకొని బీరన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రణవ్‌బాబు మాట్లాడుతూ.. గ్రామదేవతలు, కులదేవతల పండుగలు అనాదిగా వస్తున్న గొప్ప ఆచారమని, దానిని కొనసాగించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపీటీసీ ఎక్కటి సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ పెద్దికుమార్, సారంగపాణి, రమేశ్, రత్నాకర్ తదితరులు ఉన్నారు.

ఇసుక రవాణాలో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, మే 27: మానేరు ఇసుక రవాణాలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మానేరు పరిరక్షణ సమితి నాయకులు సంధి రమణారెడ్డి, చిటికేసి సతీశ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇసుక మాఫియాపై విచారణ కమిటీ ఏర్పాటు చేసి దోషులు, వారికి సహకరించిన అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే మానేరు తీర ప్రాంత రైతుల జీవనోపాధి పరిరక్షణ కోసం పటిష్టంగా చెక్ డ్యాంలను నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మానేరు పరిరక్షణ సమితి నాయకులు మార్వాడీ సుదర్శన్, ముత్తయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-All
CHANGE OF NAME
★ I, KATTEKOLA ANJAIAH, S/o KATTEKOLA MALLAIAH H.No. 1-16, Vill: SULTHANPUR, Mdl: ELIGAID, Dist: PEDDAPALLY, TS. changed my Name as ANGIENEE KUMAAR KATTEKOLA S/o KATTEKOLA MALLAIAH.
NTK-311247
CHANGE OF NAME
★ Saini Divya, D/o Nagaiah (before marriage) H.No. 5-48, V/o Gouskulapally, Mudapally, Chandurthi mandal, Rajanna Sircilla Dist. my name was changed as Marripally Divya W/o Sathish (after marriage)
NTK-311486
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

చెరువు శిఖం మాయం

ఆక్రమణకు గురైనదిగా భావిస్తున్న ధర్మారం గొడుగు కుంట శిఖం

- జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో విలువైన భూమిపై అక్రమార్కుల కన్ను
- కబ్జా చేస్తున్నారని వార్డు ప్రజల ఫిర్యాదు
- పట్టించుకోని అధికారులు.. తాజాగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్

జమ్మికుంట, మే 27: మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు(ధర్మారం) సమీపంలోని గొడుగు కుంట శిఖం భూమిపై అక్రమార్కుల కన్ను పడిందా..? చెరువు శిఖం మాయమవుతున్నదా..? అంటే అవుననే స్పష్టమైన సమాధానం స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నది. ఇదే విషయమై తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, తదితరులకు ఫిర్యాదులు వస్తున్నా ఆక్రమణలు మాత్రం ఆగడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో స్థానిక కౌన్సిలర్ బొంగోని వీరన్న సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

కౌన్సిలర్ ఫిర్యాదు ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలో 2వ వార్డు ధర్మారం. కొత్తపల్లి-ధర్మారం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని గొడుగు కుంట (0-33 గుంటలు)ఉంది. ఇది కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు కుంటగా చెబుతున్నారు. సదరు కుంట సమీపంలో కొందరికి సంబంధించిన పట్టా భూములు ఉన్నాయి. అయితే కుంట మధ్య నుంచి ప్రధాన రహదారి వెళ్లింది. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా కుంట ఉంది. కుంటలో నీరు లేకపోవడంతో బొందలుగా ఏర్పడింది. ఇదిలా ఉండగా.. జమ్మికుంట మున్సిపల్, దాని పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక్కడ భూమి ధర అనూహ్యంగా పెరిగిపోయింది. ప్రస్తుతం కుంటకు ఇరువైపులా గజం ధర రూ.20వేలకు పైగా పలుకుతున్నది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమలే అవుట్ రియల్టర్లు, పట్టాదారులు కుంటను కబ్జా చేస్తున్నారు. రూ.లక్షలు విలువజేసే భూమిని అమ్ముకుంటున్నారు. సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొందరు తమకు పట్టా ఉందంటూ.. ఆక్రమణకు తెగబడుతున్నారు. రెండు రోజుల నుంచి ఓ వ్యక్తి బహిరంగంగానే కుంటలో మట్టి పోసి కబ్జాకు యత్నిస్తున్నాడు. సదరు వ్యక్తిపై ధర్మారం ప్రజలు స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. కానీ, అక్రమార్కుడు మాత్రం తన పనిని కానిచ్చాడు. స్థానిక అధికారులు పట్టించుకోక పోవడంతో కౌన్సిలర్ వీరన్న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


కలెక్టర్‌కు కౌన్సిలర్ వీరన్న చేసిన ఫిర్యాదుకాపీ

కుంటను కాపాడాలి

ఏళ్లనాటి కుంట ఇది. ఇక్కడి భూములకు ధరలు బాగా పెరిగినయ్. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొంత కబ్జా చేసిన్రు. సమీప పట్టాదారులు ఆక్రమించుకుంటున్నరు. స్థానిక అధికారులు పట్టించుంట లేరు. అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలే. కబ్జాకు గురవుతున్న రూ.కోట్ల విలువ జేసే కుంట భూమిని కాపాడాలే. హద్దులు ఏర్పాటు చేయాలే.

-బొంగోని వీరన్న, 2వ వార్డు కౌన్సిలర్

కాంట్రాక్ట్ ఎల్టీకి మెమో

విద్యానగర్, మే 27: కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్న ఉమకు మెమో జారీ చేసినట్లు జీజీహెచ్ కరీంనగర్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి సోమవారం తెలిపారు. మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పేషెంట్‌కు బ్లడ్ గ్రూప్ నిర్ధారణలో జరిగిన తప్పిదానికి సంబంధించి 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

కమాన్‌చౌరస్తా, మే 27 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం అంగవైకల్యం, ఎన్‌సీసీ, స్టోర్ట్స్ సర్టిఫికెట్లు కలిగిన విద్యార్థులకు మే 28, 29 తేదీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని యూనివర్సిటీ దోస్త్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సర్టిఫికెట్లు కలిగిన విద్యార్థులు మంగళ, బుధవారాల్లో యూనివర్సిటీ దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో సంప్రదించాలని సూచించారు.

బెల్లి లలిత జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

తెలంగాణచౌక్, మే 27: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన బెల్లి లలిత జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగ కొమురయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో తన ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచిన బెల్లి లలితను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి గోషికి శంకర్, నాయకులు షకీల్, బాబీ, చిర్ల గట్టయ్య పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై కేసు

వీణవంక, మే 27: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన పస్తం బాలాజీ, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీనివాస్ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి సోమవారం తెలిపారు. ట్రాక్టర్‌లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఎవరు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మానేరు పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నేషనల్ సెమ్స్ ఒలింపియాడ్‌లో ర్యాంకులు • ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఆత్రేయ

నేషనల్ సెమ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన మానేరు విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత

కొత్తపల్లి, మే 27: సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ సెమ్స్ ఒలింపియాడ్ 2024లో కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారని విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఏ ఆత్రేయ అద్వితీయ ప్రతిభ చూపి ఆల్ ఇండియా 1వ ర్యాంక్, 10వ తరగతి విద్యార్థిని కాజల్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, సాయి మానేరు పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని లాస్య ప్రియ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే వహీదున్నీస్సా ఆల్ ఇండియా 2వ ర్యాంక్ సాధించగా, దీక్షిత్, పరీక్షిత్ సారథి స్టేట్ 2వ ర్యాంక్, అక్షయ, అరవింద్ రెడ్డి, సాత్విక్ రెడ్డి, సంజన్ తేజ్ స్టేట్ 3వ ర్యాంక్, అమృత, మన్విత, హర్షవర్ధన్, శ్రీజయ స్టేట్ 4వ ర్యాంక్, అక్షయ స్టేట్ 5వ ర్యాంక్, ప్రణవి విశ్వనాథ్ స్టేట్ 6వ ర్యాంక్, అయిరా జరీన్, దేవేష్ స్టేట్ 7వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా, స్టేట్ లెవల్ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న సెమ్స్ ఒలింపియాడ్‌లో మానేరు విద్యార్థులు జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంక్‌లను కైవసం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో జరిగే ఈ ఒలింపియాడ్ భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులను మానేరు విద్యాసంస్థల డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతారెడ్డితోపాటు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

రాష్ట్రంలో రైతులకు విత్తనాలు అందించలేని దుస్థితి

కరీంనగర్ రూరల్, మే 27: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రైతులకు కనీసం జీలుగ విత్తనాలు అందించలేని దుస్థితి నెలకొన్నదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో ఇప్పటి వరకు కేవలం 40 నుంచి 60 జీలుగు విత్తనాల బస్తాలను మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. మండలంలోని రైతులకు అవసరమైన మేర విత్తనాలు వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా అపూర్వ సమ్మేళనం

గంగాధర, మే 27 : బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో 2005-06 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న రెండు లారీలు: తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 27: మండలంలోని కొత్తగట్టు శివారులో నిర్మాణంలో ఉన్న కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి 563పై రెండు లారీలు ఓ కారును ఢీకొన్న ఘటనలో కారు పాక్షికంగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన భాస్కర్‌రెడ్డి తన ఇద్దరు కూతుళ్లను తీసుకొని సింగాపూర్ కిట్స్ కళాశాలలో అడ్మిషన్ తీసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తగట్టు వద్ద కారును ఓ లారీ వెనుక నుంచి ఢీకొన్నది. కారు అడ్డం తిరగడంతో మరో లారీ ముందు భాగంలో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు సీటు బెల్ట్ ధరించి ఉండడం, ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయట పడినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకున్నారు.

ప్రమాదాలకు కేరాఫ్ ఎన్‌హెచ్ 563

- టిప్పర్ డ్రైవర్ల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు
- గాలిలో కలుస్తున్న నిండు ప్రాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు, నిర్మాణ సంస్థ

నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి 563 ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రోడ్డు నిర్మాణ సంస్థ టిప్పర్ల డ్రైవర్ల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు జరిగి, నిండు ప్రాణాలు గాలిలో కలుస్తుండడంతో ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. కేవలం నెల రోజుల వ్యవధిలో మండలంలో ముగ్గురు మృత్యువాత పడగా, మరికొందరు తీవ్ర గాయాలపాలవడం ఇక్కడి పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తున్నది.

-శంకరపట్నం, మే 27

ఎన్‌హెచ్-563 నిర్మాణ సంస్థ దిలీప్ బుల్డ్‌కాన్‌కు చెందిన టిప్పర్లు మృత్యు శకటాలుగా మారి ప్రయాణికుల ప్రాణాలు బలిగొంటున్నాయి. ఈ నెల 14న తాడికల్ గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్ రోడ్డు పక్కన నిలబడి ఉండగా ఇదే సంస్థకు చెందిన డీజిల్ ట్యాంకర్ బోల్తా పడగా అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో బస్సు కోసం వేచి ఉన్న తాడికల్, చింతగుట్టకు చెందిన ఏడుగురు ప్రమాదం బారిన పడగా, ఇందులో కొందరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కనకమ్మ అనే మహిళ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. అలాగే తాడికల్‌లో ఈ నెల 20న మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పర్వతం ఎల్లయ్య అనే చిరు వ్యాపారిని మట్టి టిప్పర్ బలిగొంది. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్లు ఎల్లయ్య పైనుంచి వెళ్లగా తల పగిలి అప్పడికక్కడే ప్రాణాలు విడిచాడు. టిప్పర్ డ్రైవర్ ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సునీల్‌రాం పారిపోతుండగా స్థానికులు వెంబడించి పట్టుకుని చితకబాదారు. అలాగే ఏప్రిల్‌లో ఓ వాచ్‌మెన్ కేశవపట్నం వే బ్రిడ్జి వద్ద ఉదయం పూట టీ తాగడానికి రోడ్డు దాటుతుండగా, టిప్పర్ ఢీకొనడంతో దవాఖానకు తరలించే లోపే మృత్యువాత పడ్డాడు. అదే నెలలో మొలంగూర్ శివారులో ఓ కారుకు టిప్పర్ ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మొత్తం మీద కేవలం ఆరు నెలల కాలంలో టిప్పర్ల డ్రైవర్ల నిర్లక్ష్యంతో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు.

రోడ్డు నిర్మాణ పనుల్లో టిప్పర్

ఇండ్ల మధ్య నుంచే రాకపోకలు

జాతీయ రహదారి పనుల్లో వినియోగిస్తున్న టిప్పర్ల డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే ఇటీవల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో తాడికల్, కేశవపట్నం, మొలంగూర్, కొత్తగట్టు శివార్లలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు మద్యం సేవించి టిప్పర్లను నడుపడం కూడా కారణమని చెబుతున్నారు. కేశవపట్నం అంబేద్కర్ విగ్రహం నుంచి గ్రామం వైపు రాత్రింబంవళ్లు మట్టి లోడ్‌తో విపరీతమైన శబ్దాలతో జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని, చిన్నారులు, వృద్ధులు నిద్రలో జడుసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రయాణికులతో పాటు రోడ్డు పక్కన ఉన్న ఇండ్లపై విపరీతమైన దుమ్మును వదులుతూ, స్పీడ్ బ్రేకర్ల వద్ద బాంబులు పేలినట్లు శబ్దాలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. అలాగే బైపాస్ రోడ్లలో, తాత్కాలికంగా నిర్మించిన దారిపై వెళ్లాలే కానీ ప్రధాన రహదారిపై, ఇండ్ల మధ్య నుంచి వెళ్తూ ప్రయాణికుల ప్రాణాలు బలిగొనడం, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుండడంపై పలువురు మండిపడుతున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారా.. అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ సంస్థ ప్రతినిధులు, అధికారులు నిద్రమత్తు వీడి మరిన్ని ప్రమాదాలు జరుగక ముందే పటిష్ట చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

తాడికల్‌లో టిప్పర్ ఢీకొని మృతిచెందిన పర్వతం ఎల్లయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న బంధువులు (ఫైల్)

ఈవీఎంల గోదాంను సందర్శించిన డీఈవో

కలెక్టరేట్, మే 27 : కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎంల గోదాంను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సందర్శించారు. లెక్కింపు పూర్తయిన అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు గోదాంలో గల గదులను పరిశీలించారు. భద్రపరిచే విధానంపై అధికారులతో డీఈవో చర్చించారు. ఈవీఎంలు భద్రపరిచేందుకు అనుకూలమైన గదులు ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఈవీఎంల నోడల్ అధికారి కిరణ్ ప్రకాశ్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, సూపరింటెండెంట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చొప్పదండి, మే 27: సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చొప్పదండి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ స్వాతి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 31లోగా గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

చొప్పదండి, మే 27: ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని, వాటికి విరుద్ధంగా స్కూళ్లు ప్రారంభించినా, ప్రచారం నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తప్పవని మండల విద్యాధికారి వేణుకుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే వివిధ రకాల పేర్లతో తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రలోభ పెట్టి ప్రవేశాలు కల్పించవద్దని తెలిపారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

చొప్పదండి, మే 27: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్టుకు పట్టణానికి చెందిన పబ్బతి పద్మ- శ్రీనివాస్ కుటుంబ సభ్యులు సోమవారం రూ. 25,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్ గౌడ్, కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ, అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు దాతల నుంచి మంచి స్పందన వస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చేపూరి సత్యనారాయణ గౌడ్, బొడిగె వెంకటేశ్ గౌడ్, శెట్టిపల్లి దామోదర్, బత్తిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రుక్మాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ చిలుక రవీందర్

చొప్పదండి, మే 27: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీపీ చిలుక రవీందర్ సూచించారు. సోమవారం మండలంలోని రుక్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ నరేందర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల ఋతుస్రావ దినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై మాట్లాడారు. మహిళలకు నెలసరిలో ఇబ్బందులు తలెత్తితే ప్రతి మంగళవారం చొప్పదండిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించే శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, క్రీడాప్రాంగణం, బృహత్ ప్రకృతి వనం, నర్సరీ, గామంలోని పారిశుధ్యాన్ని పరిశీలించి, జీపీ కార్యదర్శి మెహెతాబ్, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నరేందర్‌తోపాటు ఏఎన్ఎం లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ అంజలీదేవి, వీవోలు మంగ, కవిత, కారోబార్ సలీమ్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

శంకరపట్నం, మే 27: మండలంలోని కేశవపట్నం గ్రామంలో సీఎస్‌సీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో లేబర్ కార్డు ఉన్న రోగులు వచ్చి ఆరోగ్య వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది బీపీ, షుగర్, థైరాయిడ్, హెచ్ఐవీ తదితర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్, క్యాంప్ కోఆర్డినేటర్ మహేశ్, వైద్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ షాహద్, డీసీ రాజేందర్, సీసీ మహేశ్, స్టాఫ్ నర్స్‌లు పద్మ, కల్యాణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు వెంట